సహజ యోగాతో సరైన మార్గం

అంతర్జాతీయ సహజయోగ యువశక్తి సమ్మేళనం ప్రారంభం





అంతర్జాతీయ సహజయోగా యువశక్తి సమ్మేళనానికి హాజరైన ప్రతినిధులు

మేడిపల్లి: సమాజాభివృద్ధిలో యువత భాగస్వాములయ్యేందుకు సరైన మార్గ నిర్దేశం సహజయోగాద్వారా లభిస్తుందని సహజయోగ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ గౌరు కృష్ణ అన్నారు. ఆధ్యాత్మిక ఉన్నతికి ,ధార్మిక సంపత్తికి యోగా పరమౌషధమని పేర్కొన్నారు. పీర్జాదిగూడ శ్రీ ఫణి కన్వెన్షన్‌లో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న అంతర్జాతీయ సహజయోగ యువశక్తి సమ్మేళనం శనివారం ప్రారంభమైంది. సమ్మేళనంలో వారు మాట్లాడుతూ..నేటి యాంత్రిక యుగంలో అధికశాతం యువతీ, యువకులు దుర్వ్యసనాల బారినపడి పెడదారిలో పయనిస్తూ విలువైన జీవితాలను దుర్భరం చేసుకుంటుంన్నారన్నారు. సహజయోగ, ధ్యానం దివ్యౌషధమని తెలిపారు. ఈ సమ్మేళనంలో 40 దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

చిన్న చెరువులో చెత్త తొలగింపు



చెరువులో చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

రామంతాపూర్: చిన్న చెరువులో వ్యర్థాలు, చెత్తతో నిండిపోయి కాలుష్యా కాసారంగా మారి దుర్వాసన వెదజల్లుతోందని శనివారం సాక్షిలో చిన్నబోయిన చిన్న చెరువు కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీంతో స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు స్పందించి జీహెచ్‌ఎంసీ సిబ్బందితో చెరువులోని చెత్తను పూర్తిగా తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న చెరువు అభివృద్ధి సుందరీకరణ పనుల కోసం త్వరలో ఎమ్మెల్యేతో చర్చించి పనులు మొదలు పెడతామన్నారు.

డివిజన్ అభివృద్ధికి కృషి



మచ్చబొల్లారం డివిజన్ భరత్‌నగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని భరత్‌నగర్, రాజీవ్‌గృహకల్ప పరిధిలో ప్రధాన సమస్యగ ఉన్న తాగునీరు, రోడ్లు, అలాగే ప్రాథమిక పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఆయన స్థానికులతో కలిసి పర్యవేక్షించారు.

నేటి నుంచి ధనుర్మాస పూజలు



మల్కాజిగిరి: మల్కాజిగిరిలో ఆదివారం నుండి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీ వెంకటేశ్వర దేవస్థానంలో ధనుర్మాస పూజలు ప్రారంభం కానున్నాయి. విశేష పూజా కార్యక్రమాలతో పాటు ప్రతి రోజూ తిరుప్పావై సేవ జరుగుతుంది. జనవరి 14న పూజలు ముగుస్తాయని ఈవో రవీందర్‌రెడ్డి, ప్రధాన అర్చకులు ముడుంబై వెంకటరమణాచార్యులు తెలిపారు.

అనంత సరస్వతీనగర్ జ్ఞాన సరస్వతీ దేవాలయంలో..

జ్ఞానసర్వసతీ దేవాలయం ఆవరణంలోని సుబ్రహ్మణ్యస్వామి ఉపాలయంలో 17,18 తేదీలలలో సుబ్రహ్మణ్యషష్ఠి పర్వదిన వేడుకలు నిర్వహిస్తున్నామని ఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు.

అడిషినల్ ఏజీకి అభినందనలు



బోడుప్పల్: తెలంగాణ రాష్ట్ర హైకోర్టు అడిషినల్ అడ్వకేట్ జనరల్‌గా బాధ్యతలు స్వీకరించిన రజనీకాంత్‌రెడ్డిని శనివారం బోడుప్పల్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు మంద సంజీవ్‌రెడ్డి కలిసి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా సంజీవ్‌రెడ్డి మాట్లాడుతూ 15 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం ఉన్న రజనీకాంత్‌రెడ్డికి ఈ పదవికి ఎంపిక కావడం ఎంతో అభినందనీయమన్నారు. రజనీకాంత్‌రెడ్డిని కలిసిన వారిలో సహకార బ్యాంక్ డైరెక్టర్ జడిగె రమేష్ యాదవ్, పార్టీ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ తదితరులున్నారు.

ఎల్లారెడ్డిగూడలో కార్పొరేటర్ పాదయాత్ర



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి

కాప్రా: క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలు తెలుసుకునేందుకు కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి శనివారం ఎల్లారెడ్డిగూడలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డిగూడలో నెలకొన్న సమస్యలు స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. బస్టాండ్ సమీపంలో నాలా ప్రమాదకరంగా ఉందని తెలిపారు. వీధి దీపాలు, తాగునీటి పైప్‌లైన్, స్మశానవాటికలో సమస్యలు, ఎల్లారెడ్డిగూడకు వచ్చే ఆర్టీసీ బస్సు 43, 3వై ని పునరుద్దరించాలని కోరారు. స్థానికుల సమస్యలు విన్న కార్పొరేటర్ సానుకూలంగా స్పందించి వాటన్నింటినీ నెరవేర్చేందుకు కృషి చేయనున్నట్లు హామీ ఇచ్చారు.

చెరువులను పరిశీలించిన అధికారులు

బోడుప్పల్: బోడుప్పల్ కమిషనర్ జి. వేణుగోపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు పొల్యూషన్ బోర్డు అధికారులు, మల్లాపూర్ ఐలా అధికారులు శనివారం బోడుప్పల్‌లోని పలు చెరువులను సందర్శించారు. రాచెరువు, సుద్దకుంట, చింతల చెరువు నాలా, ఇతర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నీటి శాంపిల్స్‌ను తీసుకున్నారు. ఈసందర్భంగా కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ చెరువుల పరిరక్షణతోపాటు సుందరీకరణకు శ్రీకారం చుడతామన్నారు.

పాఠశాలలో వసతుల కల్పనకు కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి

అల్వాల్: ఓల్డ్ అల్వాల్‌లోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం అల్వాల్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ అల్వాల్ జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలకు సెక్యూరిటీ, వాటర్ పైపులైన్‌తోపాటు పాఠశాలలో కథల పుస్తకాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మురుగు తిప్పలు..పట్టించుకోని అధికారులు



మల్లాపూర్ బ్రహ్మపురికాలనీ ప్రధాన రహదారిలో పారుతున్న డ్రైనేజీ నీరు



నాచారం హనుమాన్ నగర్‌లో ఇళ్ల మధ్య నిలిచిపోయిన డ్రైనేజీ నీరు

మల్లాపూర్: మల్లాపూర్, నాచారం డివిజన్‌లోని ఏ కాలనీలో చూసిన భూగర్భడ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. ప్రతి రోజు రోడ్లపై మురుగు నీరు ప్రవహించడటంతో దుర్వాసనతో ప్రజలు నరకం అనుభవిస్తున్నారు. మల్లాపూర్ మాణిక్‌చెంద్ రోడ్‌లోని బ్రహ్మపురికాలనీ ప్రధాన రోడ్డు, రామకృష్ణ ఫంక్షన్ హల్ వెళ్లే దారిలో గత నెల రోజులుగా మ్యాన్‌హోల్స్ పొంగిపోర్లుతున్న పట్టించుకునే నాథుడు కరువయ్యారు. స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాచారం డివిజన్ పరిధిలోని హనుమాన్ నగర్‌లో డ్రైనేజీ పొంగి నీరు నిలిచిందిపోయింది.

దీంతో వాసన భరించలేక అనారోగ్యలపావుతున్నారు. సీవరేజ్ అధికారులు, సిబ్బంది అలసత్వం వహిస్తున్నారని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నాలా పనులు పూర్తి చేయండి



ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమైన కార్పొరేటర్

మల్కాజిగిరి: ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నాలా పనులు పూర్తి చేయాలని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ కాంట్రాక్టర్‌ను కోరారు. బాలసరస్వతీనగర్ కాలనీలో నాలా పనులు ఆగిపోవడంతో కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొని వచ్చారు. శనివారం సర్కిల్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు. గతంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు చేయలేకపోతున్నామని కాంట్రాక్టర్ తెలిపారు. బిల్లులు రావడానికి చర్యలు తీసుకుంటామని ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని పనులు ప్రారంభించాలని కోరడంతో కాంట్రాక్టర్ అంగీకరించారు. సమస్యను పరిష్కరించడానికి అధికారులతో సమావేశం నిర్వహిస్తే ఈఈ హాజరు కాకపోవడం భాధ్యతారాహిత్యమని కార్పొరేటర్ శ్రవణ్ అసంతృప్తి వ్యక్తం చేశారు.

దోమల నివారణకు ప్రత్యేక బృందాలు



దోమల మందు పిచికారి చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో దోమల నియంత్రణకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. నగర పరిధిలో ప్రతి డివిజన్లో రెండు ఎలక్ట్రిక్ స్ప్రేమిషన్‌ల ద్వారా అధికారుల పర్యవేక్షణలో శనివారం ప్రత్యేక బృదాలను ఏర్పాటు చేసి అన్ని గృహాలకు డోర్ టు డోర్ దోమల మందును పిచికారి కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా మేయర్ జక్కా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఇంటి లోపల పిచికారి చేసే దోమల మందు సీజెంట వారి ఐకాన్ క్రిమి సంహారక మందువల్ల ఆరోగ్యపరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని ఈ మందు ద్వారా దోమలు రాకుండా నివారించ వచ్చన్నారు.

టెన్త్ విద్యార్థి ఆత్మహత్య



నిఖిల్ గౌడ్ (ఫైల్)

ఉప్పల్: పదవ తరగతి విద్యార్థి అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామంతాపూర్, బాలాజీనగర్‌లో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు..నారాయపురం ప్రాంతానికి చెందిన నరసింహా గౌడ్ వృత్తి రీత్యా ఇసుక వ్యాపారి. రామంతాపూర్‌లో కుటుంబ సమేతంగా ఉంటున్నాడు. ఇతనికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు ఇంటర్ చదువుతున్నాడు. చిన్న కుమారుడు నిఖిల్ గౌడ్(15) రామంతాపూర్‌లోని రాజేంద్రనగర్‌లోని అమ్మ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు. శనివారం తల్లిదండ్రులు చౌటుప్పల్‌లోని శుభకార్యానికి వెళ్లారు. పెద్ద కుమారుడు కళాశాలకు వెళ్లాడు. నిఖిల్ గౌడ్ ఇంట్లోనే ఉన్నాడు. మద్యాహ్నం తల్లి దండ్రులు పక్క ఇంటికి ఫోన్ చేసి నిఖిల్ గురించి ఆరా తీశారు. ఆయితే గడియపెట్టుకుని ఇంట్లోనే ఉన్నాడని తలుపులు తెరవడం లేదని సమాచారం ఇచ్చారు. తలుపులు పగుల గొట్టి లోనికి వెళ్లి చూడగా ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని మృతి చెంది ఉన్నాడు. ఇదే విషయాన్ని స్థానికులు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృత దేహాన్ని స్వాధీనం చేసుకున్న పోస్టుమర్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

ఉప్పల్ బిల్డర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరిగిన సమావేశంలో ఉప్పల్ బిల్డర్స్ అసోసియేషన్ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. ఉప్పల్ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శాడగొండ కరుణాకర్ రెడ్డి, కార్యదర్శిగా సత్యనారాయణ, కోశాధికారిగా మురళీ, చైర్మన్ రమేష్, సలహాదారులగా రమేష్ బాబు, ఉపాధ్యక్షులుగా ఎస్.సతీష్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి.సంయుక్త కార్యదర్శులుగా డి.రాజేష్ రెడ్డి, వి.వి.నర్సిహా రెడ్డిలను ఎన్నుకున్నారు. పీర్జాదిగూడ నగర మేయర్ జక్కా వెంకట్ రెడ్డి హాజరయ్యారు.



ఉప్పల్ బిల్డర్స్ అసోసియేషన్ నూతన కమిటీ

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ చేతన

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్ రవీంద్రనగర్ కాలనీలో రోడ్డు పనులను శనివారం కార్పొరేటర్ కక్కిరేని చేతనహరీష్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆమె అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఈఈ నాగేందర్, ఏఈ సాయికిరణ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్ రాథోడ్, బీజేపీ నాయకులు రాఘవరెడ్డి, సంజయ్ పటేల్, కాలనీవాసులు పాల్గొన్నారు.

దేశానికి వెన్నముక రైతు



రామంతాపూర్ : శ్రీ చైతన్య స్కూల్‌లో స్మార్ట్ లివింగ్ కార్యక్రమంలో భాగంగా శనివారం జై కిసాన్ జై భారత్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ఏజీఎం సతీష్ మాట్లాడుతూ రైతు దేశానికి వెన్నముకని రైతు లేకపోతే ఆహార సంక్షోభం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మీ, మల్లికార్జునరావు, పుల్లారావు, నాగరాజు, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దక్కన్ స్ప్రింగ్ స్కూల్‌కు ఎక్సలెన్స్ అవార్డు



మల్లాపూర్: నాచారం దక్కన్ స్ప్రింగ్ గ్లోబల్ స్కూల్‌కు ప్రతిష్టాత్మక టైమ్స్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ 2023 అవార్డు లభించింది. బెస్ట్ స్కూల్ ఫర్ ఫ్యూచరిస్టిక్ ఎడ్యుకేషన్ విభాగంలో అవార్డు వరించింది. బాలివుడ్ హిందీ నటుడు అనిల్ కపూర్ చేతుల మీదుగా పాఠశాల ప్రిన్సిపల్ సుమా మీనన్, వైస్ ప్రిన్సిపల్ అక్కినేని స్వర్ణ అవార్డును అందు కున్నారు.

ఆలయ దుకాణాల నిర్వహణకు బహిరంగ వేలం

కాప్రా: ఏఎస్‌రావునగర్ డివిజన్ కమలానగర్ టీఎస్ ఐఐసీ కాలనీలో గల శ్రీ సహస్రలింగేశ్వర స్వామి ఆలయంలో దుకాణాల నిర్వహణకు ఈ నెల 22న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. 2024 జనవరి 1 నుంచి 2025 డిసెంబర్ 31 వరకు టెంకాయలు-పూజాసామగ్రి, కొబ్బరి చిప్పల సేకరణ విక్రయం, కిరాణ సరుకుల సరఫరా, స్వామివారి శేషవస్త్ర, అమ్మవారి చీరలు సేకరణ విక్రయ హక్కు కోసం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. టెంకాయలు-పూజాసామాగ్రికి రూ. 20 వేలు, కొబ్బరిచిప్పల సేకరణ విక్రయంకు రూ. 5 వేలు డిపాజిట్ చేసి బహిరంగ వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

నకిలీ సంతకాలతో స్థలం మాయం చేశారు

ఉప్పల్: ఫోర్జరీ సంతకాలు, నకిలీ డాక్యుమెంట్లతో ఓ మహిళ స్థలాన్ని కాజేసిన వ్యక్తిపై ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రామంతాపూర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. నాగోల్ మమతానగర్‌లో నివాసముండే రాచూరి ఉమారాణి(58) 2000లో రామంతాపూర్‌లోని సర్వేనంబర్ 74, 75లో150 గజాల స్థలాన్ని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకుంది. ఈ క్రమంలో తన ప్లాట్‌లో గుర్తు తెలియని వ్యక్తులు ప్రహరీ నిర్మించారని గమనించి ఆరా తీయగా స్థానికంగా ఉండే ఒక ముఠా తనపేర నకిలీ ఆధార్ కార్డులు, ఫోర్జరీ సంతకాలు, నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి కానుగంటి నాగరాజు రావు పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. దీంతో బాధితురాలు ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

మంత్రి సీతక్కను కలిసిన కాంగ్రెస్ నేతలు



అల్వాల్: మంత్రి సీతక్కను అల్వాల్‌కు చెందిన కాంగ్రెస్ నేతలు తోట ధశ్మంత్‌రెడ్డితోపాటు పలువురు నేతలు శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

17 నుంచి శ్రీవారి ఉత్సవాలు



అల్వాల్: అల్వాల్‌లోని బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 17 నుండి 26వ తేది వరకు బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని వివిధ రంగులతో ముస్తాబు చేస్తున్నట్లు తెలిపారు. 410 సంవత్సరాల పురాతన దేవాలయం, దక్షిణమూర్తిగా పిలువబడే స్వామివారి ఆలయానికి విద్యుత్ కాంతులతో అలంకరించినట్లు తెలిపారు.

రోడ్డు సమస్యను పరిష్కరించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న భవానీనగర్ కాలనీ వాసులు.

కాప్రా: ఏఎస్‌రావునగర్ డివిజన్‌లోని భవానీనగర్‌లో రోడ్డు సమస్యను పరిష్కరించాలని స్థానిక కాలనీ వాసులు శనివారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కోరారు. ప్రస్తుతం ఉన్న 50 ఫీట్ల రోడ్డును వెడల్పు విస్తరించాలని విజ్ఞప్తి చేశారు. ఇదే అంశంపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు కాసం మహిపాల్‌రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

వసతుల కల్పనకు కృషి



డ్రైనేజీ పనుల శంకుస్థాపనలో పాల్గొన్న మేయర్ బుచ్చిరెడ్డి

బోడుప్పల్: దశల వారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. వీరారెడ్డి కాలనీలో రూ 14 లక్షల వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. అన్ని డివిజన్లలో తీర్మానం చేసి పెండింగ్ ఉన్న పనులను త్వరలో ప్రారంభించి పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పొద్దుటూరి శోభారాణి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



ఉప్పల్: ఉప్పల్ మిని శిల్పారామంలో శనివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. లహరి ఘంటసాల శిష్యబృందం నిర్వహించిన పలు కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మూషిక వాహన, వేంకటచల నిలయం, పాహిమాం, రాజరాజేశ్వరీ, గంధము పూయరుగా తదితర అంశాలను కళాకారులు దీక్షిత, నేత్ర, నయన, ఐశ్వర్యం, శాన్విత, పూజిత, లాస్యబిందు తదితరులు ప్రదర్శించి మెప్పించారు.

గంజాయి విక్రేత అరెస్టు



గంజాయి విక్రేతను చూపిస్తున్న ఉప్పల్ ఎక్సైజ్‌పోలీసులు

ఉప్పల్: గుట్టు చప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ భగాయత్‌లోని సురాపానం బార్ వద్ద వ్యక్తి గంజాయితో సంచరిస్తున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని మాటువేశారు. ఇతలోనే ఒక వ్యక్తి అనుమానాస్పద స్థితిలో తచ్చాడుతుండగా అతన్ని అదుపులోకి తీసుకుని చెక్ చేయగా రెండు కిలో ప్యాకెట్ల గంజాయి లభించింది. సదరు వ్యక్తి కొల్హాపూర్ మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన బి పి రవీంద్రా గా గుర్తించారు. ఇతని వద్ద నుంచి రెండు కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.